


# ఒక్క నిమిషం

'నువ్వు ఎక్కదలచుకొన్న రైలు ఎప్పుడూ ఒక జీవితకాలం లేటు' సరిగ్గా ఇలాగే జరిగింది యుగంధర్ విషయంలో. కాకపోతే రివర్సులో. సైంటిస్టు కావలసిన వాడు లెక్చరర్‌గా స్థిరపడిపోయాడు. ఎమ్‌సెట్ పరీక్షలు కూడా ఇలాంటివే. పిల్లల జీవితాల్నే మార్చేస్తాయి. ఒక్క నిమిషం లేటయినా రైలు అందుకోలేదు. మరొక రైలు కోసం ఒక సంవత్సరకాలం ఎదురుచూడవలసిందే.

యుగంధర్ ఆ రోజు ఎమ్‌సెట్ ఇన్విజిలేషన్ చేసుకొని ఇంటికి వచ్చాడు పరీక్షలు. పోటీ పరీక్షలు. పిల్లలు చాలా జాగ్రత్తగా, శ్రద్ధగా, పరీక్షలు రాస్తారు. ఒక్క దశాంశం తగ్గినా సీటు రాకపోవచ్చు. అందుచేత పరీక్షలు చాలా జాగ్రత్తగా నిర్వహిస్తారు. ఎక్కడా, ఏమాత్రం మాల్‌ప్రాక్టీసుకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తారు. 10 గంటలకు పరీక్ష ప్రారంభం. పరీక్ష ప్రారంభానికి ముందు చాలా ప్రిలిమినరీస్ ఉంటాయి. అందుకోసం 9.30కే ఇన్విజిలేటర్లు తమకు కేటాయించిన హాల్స్‌కి చేరుకున్నారు. విద్యార్థులు ఒక్కరే వస్తున్నారు. తమకు కేటాయించిన సీట్లలో కూర్చుంటున్నారు. ఆఫీసు సిబ్బంది పిల్లల హాల్‌టిక్కెట్లు చూస్తూ వాళ్లను గదులలోకి పంపుతున్నారు. అంతా తొందర తొందర. హడావుడి.

"ఎవరైనా టాయిలెట్స్‌కి వెళ్లవలసి ఉంటే ఇప్పుడే వెళ్లండి. పరీక్ష మధ్యలో బయటకు పంపడం జరగదు" కొందరు లేచారు. "వేగంగా రండి. ముందుగా చేయవలసిన పనులు చాలా ఉన్నాయి" యుగంధర్ ఎనౌన్స్ చేస్తున్నాడు.

"సెల్‌ఫోన్‌లు గానీ, ఆర్గనైజర్లు గానీ, కాలిక్యులేటర్లు గానీ మీ దగ్గర ఉంచుకోకూడదు. సరండర్ చేయండి. మీ దగ్గర, మీ చుట్టుపక్కల ఫర్‌బిడెన్ మెటీరియల్ లేకుండా చూసుకోండి. ఉంటే ఇప్పుడే ఇవ్వండి. తెల్లకాగితం కూడా ఉంచుకోకూడదు."

విద్యార్థులు స్పందించారు. కొందరు బస్ టిక్కెట్లు ఇచ్చారు. తీసుకొని బయట చెత్తబుట్టలో వేశాడు యుగంధర్. బస్‌పాస్‌లు చెక్ చేసి తిరిగి ఇచ్చేశాడు.

"మీ టేబుల్ చెక్ చేసుకోండి. ఏవైనా రాసుంటే ఇప్పుడే చెప్పండి. తరువాత అబ్జర్వర్లు వచ్చి చెక్ చేయవచ్చు."

ఇద్దరు పిల్లలు లేచారు. ఒకరి టేబుల్ మీద రెండు ఫిజిక్స్ ఫార్ములాలు ఉన్నాయి. ఇంకొకరి టేబుల్ మీద ఇంగ్లీషు వ్యాసం ఉంది. "ఇది ఫర్వాలేదు. కూర్చో" అంటూ ఎటెండరుని పిలిచి తడిగుడ్డతో ఫార్ములాలు చెరిపించాడు యుగంధర్. ఎవరో చేసిన తప్పుకి ఆ అమాయకుడికి శిక్ష పడకూడదు.

విద్యార్థులు సిద్ధంగా ఉన్నారు. సిబ్బంది వరండాలో ఉన్న వాళ్లను గదులలోకి తరుముతున్నారు. పది గంటలలోపు అన్ని పనులూ పూర్తయిపోవాలి.

ఇప్పుడు మీకు ఎటెండెన్స్ షీట్‌లు ఇస్తాం. మీ పేరు, రిజిస్టరు నెంబరు, రిజర్వేషన్ కేటగిరీ సరిపోయాయో లేదో చూసుకోండి. మీ పేరులో స్పెలింగ్ మిస్టేక్స్ ఉంటే దిద్దుకోవచ్చు. అలాగే రిజర్వేషన్ కేటగిరిలో కూడా... బుక్‌లెట్ సీరియల్ నెంబరు, బుక్‌లెట్ కోడ్ క్వశ్చన్ బుక్‌లెట్ ఇచ్చిన తరువాత నింపొచ్చు. ప్రస్తుతానికి ఖాళీగా ఉంచండి. చివర కోలమ్‌లో సంతకం చేయండి"

"అప్పారావుగారూ, మీరు ఎటెండెన్స్ షీట్ మీద సంతకాలు చేయించండి. నేను కేండిడేట్స్ ఐడెంటిటీ వెరిఫై చేస్తాను"

విద్యార్థుల ముఖాలు, వారి హాల్ టిక్కెట్ మీద ఉన్న ఫోటో ఒక్కలాగే ఉన్నాయో లేదో చూసి, హాల్‌టిక్కెట్ మీద నెంబరు, టేబుల్‌మీద నెంబరు సరిపోయాయో లేదో వెరిఫై చేస్తున్నాడు యుగంధర్.

"ఇప్పుడు మీకు ఓ.యం.ఆర్. షీట్స్ ఇస్తాం. మొదటి పేజీలో మీ పేరు, రిజిస్టరు నెంబరు మొదలైన వివరాలు మార్కు చేయండి. క్వశ్చన్ బుక్‌లెట్ సీరియల్ నెంబరు, బుక్‌లెట్ కోడు ఇప్పుడు మార్కు చెయ్యొద్దు. క్వశ్చన్ బుక్‌లెట్ ఇచ్చిన తరువాత మార్క్ చెయ్యొచ్చు. ఓ.యం.ఆర్.షీట్ మీద కూడా సంతకం చేయండి" అంటూ విద్యార్థుల ఎటెండెన్స్ షీట్‌లో సంతకం చేసిన వెంటనే వారికి ఓ.యం.ఆర్. షీట్స్ ఇచ్చాడు అప్పారావు. ఇంకా ఒకరిద్దరు వస్తూనే ఉన్నారు. యుగంధర్ చెప్పిన విషయాన్నే మళ్లీ మళ్లీ చెప్తున్నాడు.

ఐడెంటిఫికేషన్ కూడా వెరిఫై చేయడం ఐపోయింది. ఇన్విజిలేటర్లు ఓ.యం.ఆర్. షీట్స్ మార్కు చేయడంలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్నారు. పరీక్ష టైమ్ దగ్గర పడుతోంది. కొంతమందికి ఒకటికి రెండుసార్లు చెప్పవలసి వస్తోంది. ఏమాత్రం తప్పుజరిగినా కంప్యూటర్ ఆ ఓ.యం.ఆర్. షీట్‌ని తిరస్కరిస్తుంది. అవతల పరీక్ష టైమ్ దగ్గరపడుతోంది. కొందరి దగ్గర నిల్చొని మరీ చెప్పవలసి వస్తోంది. పది గంటలు కావస్తోంది. ఇన్విజిలేటర్లకి ఒకటే టెన్షన్.


"ఓ.యం.ఆర్. షీట్ నింపడం ఐపోయిందా? అందులో ఉన్న గడిలో సంతకం చేయండి"

స్పెషల్ అసిస్టెంటుగారు క్వశ్చన్ బుక్‌లెట్స్ తెచ్చారు. "ఇవి సీరియల్ నెంబరు ప్రకారం ఉన్నాయి. బుక్‌లెట్ కోడు ప్రకారం ఎ.బి.సి.డి. ఒకదాని కింద ఒకటి వరుసగా ఉన్నాయి. మీరు షఫుల్ చెయ్యవలసిన పనిలేదు. వరుసగా ముందు నుండి వెనక్కి, మళ్లీ రెండో వరుస ముందు నుండి వెనక్కి పంచండి. ఆబ్సెంటు అయిన వాళ్ల ప్లేసులో కూడా క్వశ్చన్ బుక్‌లెట్ ఉంచండి. అలాగైతే తప్పు జరగదు. బెల్‌కొట్టిన తరువాత తీసుకోవచ్చు. ఇతరులెవరూ ముట్టుకోకుండా చూడండి. నలభై ఉంటాయి. ఒకసారి లెక్కపెట్టుకోండి" గుక్క తిప్పుకోకుండా చెప్తూ ఎంత వేగంగా వచ్చాడో అంత వేగంగా మరొక రూమ్‌కి వెళ్లిపోయారు స్పెషల్ అసిస్టెంట్‌గారు. ఇదే విషయాన్ని ఏకరువు పెట్టడానికి.

తొమ్మిదీ ఏభై ఐదు నిమిషాలు అయింది. ఎలర్ట్ బెల్ కొట్టారు. హాలంతా నిశ్శబ్దంగా ఉంది. క్వశ్చన్ బుక్‌లెట్స్ ఎప్పుడు తమ చేతికి అందుతాయా అని ఎదురుచూస్తున్నారు పిల్లలు.

"పది గంటలకి రెండు నిమిషాల ముందు క్వశ్చన్ బుక్‌లెట్ ఇస్తాం. పది గంటలకు బెల్ కొడతారు. అంతకు ముందు ఎవరూ సీల్ ఓపెన్ చేయకూడదు. మీకిచ్చిన బుక్‌లెట్ కోడు, మీ టేబుల్ మీద రాసిన కోడ్ సరిపోయాయో లేదో చూసుకోండి" అప్పారావు వరుసగా క్వశ్చన్ బుక్‌లెట్స్ టేబుళ్ల మీద పెట్టు కుంటూ వెళ్లిపోతున్నారు. యుగంధర్ ఎవరూ సీల్ చింపకుండా కాపలా కాస్తున్నాడు.

ఒక అమ్మాయి ఆదరా బాద రాగా వచ్చింది. "ఏవమ్మా పరీక్షకి కనీసం అరగంట ముందు రావాలని తెలీదా?" ఆ అమ్మాయి ఏమిటో చెప్పబోతుంది. వినిపించుకునే సమయం లేదు. ఈ ఇరవై నిమిషాలలో జరిగిన పనంతా ఒక్క నిమిషంలో ఐపోవాలి. ఒకవైపు కాపలా కాస్తూనే ఐడెంటిఫై చేశారు. సీట్లో కూర్చోబెట్టారు. ఎటెండెన్స్ షీట్‌లో సంతకాలు, ఓ.యం.ఆర్. షీట్స్ నింపడం చకచకా జరిగిపోవాలి. పరీక్ష ప్రారంభం అయిన తరువాత విద్యార్థుల ఏకాగ్రతకు భంగం కలిగించకూడదు. ఇనా ఇటువంటి వారి వల్ల చుట్టుపక్కల కూర్చున్న పిల్లలు బాధపడక తప్పదు.



"ఓ.యమ్.ఆర్. షీట్‌లో మీ క్వశ్చన్ బుక్‌లెట్ సీరియల్ నెంబరు, కోడు మార్కు చేయండి. మళ్లీ మీకు ఎటెండెన్స్ షీట్ ఇస్తాం. దానిలో కూడా ఈ రెండూ రాయండి. సీల్ ఓపెన్ చేయొద్దు అన్నానా?" గట్టిగా అరిచాడు యుగంధర్. సీల్ ఓపెన్ చేసిన వాడు బుక్‌లెట్ లోపలి విషయాలు చదవకుండా పుస్తకం మీద చెయ్యి పెట్టాడు యుగంధర్. "బెల్ కొట్టేలోపుగా కవరు మీద రాసిన సూచనలు చదువుకోండి" అంటుండగానే బెల్ కొట్టారు. "ఓపెన్ సీల్స్. మీ పుస్తకంలో అన్ని పేజీలు, అన్ని ప్రశ్నలూ ఉన్నాయో లేదో చూసుకోండి. ప్రింటు పడకపోయినా, పేజీలు లేకపోయినా ఇప్పుడే చెప్పండి. మరొక పుస్తకం ఇస్తాం. స్టార్ట్ రైటింగ్"

ఓ.యం.ఆర్. షీట్స్ వెరిఫై చేసి సంతకాలు చేస్తున్నారు. ఆఖరుగా వచ్చిన అమ్మాయి ప్రశ్నలకు జవాబులు రాయడంలో నిమగ్నమై ఉంది. అప్పారావు ఓ.యమ్.ఆర్. షీట్ మీద సంతకం చేయాలని చూస్తే అంతా ఖాళీ. టైమయిపోతుంది. తర్వాత నింపుతానంటుంది. మొదటి పేజీ ప్రాముఖ్యత చెప్పడానికి సమయం చాలదు. పక్కవాళ్ల ఏకాగ్రతకు భంగం కలుగకుండా మెల్లగా ఆమెను ఒప్పించి మొదటి పేజీ మార్కు చేయించి ఆమె చేత సంతకం చేయించి, తను కూడా సంతకం చేసి బాధ్యత తీరిపోయినందుకు హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు అప్పారావు. మిగిలిన విద్యార్థులు ఇబ్బంది పడుతున్నా గమనించనట్టే నటించాడు.

విద్యార్థులు దించిన తల ఎత్తకుండా రాసుకొంటున్నారు. ఇన్నాళ్లు పడిన శ్రమ ఫలించబోతున్న తరుణం ఇది. వారి ఏకాగ్రతకు ఏమాత్రం భంగం కలగకుండా ఉండడానికి పరీక్షాధికారులు తగిన ఏర్పాట్లు చేశారు. గ్లాసులతో నీళ్లందించడానికి ప్రతి గదికి ఒక వాటర్‌బాయ్‌ని ఉంచారు.

"మీరు మంచినీళ్లకు కూడా లేవవలసిన పని లేదు. సైగ చేస్తే బాయ్ మీకు నీళ్లు అందిస్తాడు. ఓ.యమ్.ఆర్.షీట్లు పాడవ్వకుండా జాగ్రత్తగా తాగండి. పెన్సిల్ అరిగిపోతే పెన్సిల్ ఇస్తాం. పెన్సిల్ చెక్కుకుంటూ టైం వేస్టు చేసుకోకండి."

ఇన్విజిలేటర్ల పని ఐపోయినట్లే. ఒంటి గంట వరకూ చూస్తూ గడవడమే. పోటీ పరీక్ష కాబట్టి విద్యార్థులే వజిలెంటుగా ఉంటారు. ఈ ఇన్విజిలేషన్ హాయి. మాల్‌ప్రాక్టీసు గొడవలుండవు. బైక్ సీటు కోసేస్తారని, టైర్‌కు మేకులు గుచ్చుతారనీ భయపడవలసిన పనిలేదు. పరీక్ష ప్రారంభానికి ముందే టెన్షన్. ప్రారంభమైన తరువాత పనేమీ ఉండదు.

రెండు పూటలూ ఇన్విజిలేషన్ చేసుకొని బడలిక తీర్చుకొని భోజనం చేసి టీవీ ఆన్ చేశాడు యుగంధర్. తొమ్మిది గంటల న్యూస్ వస్తోంది. "ఈ రోజు జరిగిన ఎమ్‌సెట్ పరీక్షా కేంద్రాల గేట్ తలుపులు పది గంటల ఒక నిమిషానికి మూసివేసి ఒక్క నిమిషం ఆలస్యమైనం

దుకు విద్యార్థులను లోపలికి అనుమతించలేదు. ట్రాఫిక్ జామ్ వల్ల, అనుకోని అడ్డంకుల వల్ల, దూరాభారం వల్ల ముందుగా పరీక్షా కేంద్రాలకు చేరుకోలేకపోయామని విద్యార్థులు అంటున్నారు. తమకు జరిగిన అన్యాయాన్ని ఎవరు సరిదిద్దుతారని ప్రశ్నిస్తున్నారు. తమ పిల్లలకు మళ్లీ లాంగ్‌టర్మ్ కోచింగు ఇప్పించుకోవాలనీ, చాలా డబ్బు ఖర్చవుతుందనీ తల్లిదండ్రులు బాధపడుతున్నారు." అంటూ ఏవేవో చెప్పుకొస్తున్నాడు. పిల్లలపై జాలి కలిగింది యుగంధర్‌కి. వారికి అన్యాయం జరిగింది. దీనిని సరిదిద్దాలి. ఎలా?

ఒక్క నిమిషం చాలు జీవనగమనాన్ని మార్చడానికి. యుగంధర్ యు.పి.యస్.సి. రాత పరీక్షలో ఎక్కువ శాతం మార్కులతో పాసయ్యాడు. ఢిల్లీ ఇంటర్వ్యూ. నెల రోజుల ముందే తమిళనాడు ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి బెర్త్ రిజర్వు చేయించుకున్నాడు. బాగా ప్రిపేరయ్యాడు. ఇంటి నుండి ముందుగానే బయలుదేరినా ట్రాఫిక్‌జామ్ వల్ల కొంచెం అలస్యం అయ్యాడు. ఐనా ట్రైన్ డిపార్చర్ టైమ్ కంటే ముందుగానే స్టేషన్ చేరుకున్నాడు. ప్లాట్‌ఫామ్ వన్ ఖాళీగా ఉంది. హమ్మయ్య ట్రైన్ ఇంకా రాలేదు. ఈ ట్రైన్ ఎప్పుడూ లేటే. "చెన్నై నుండి ఢిల్లీ వెళ్లే తమిళనాడు ఎక్స్‌ప్రెస్ నాలుగవ నెంబరు ప్లాట్‌ఫాం నుండి బయలుదేరుటకు సిద్ధంగా ఉన్నది". యుగంధర్ గుండెల్లో రైల్లు పరుగెట్టాయి. ఒక్క ఉదుటున బ్రిడ్జి పైకి చేరుకున్నాడు. ఎదురుగా వస్తున్న జనాన్ని తప్పించుకుంటూ పరుగెత్తాడు. ఆఖరి కంపార్టుమెంటైనా అందుకోగలనని ఆశ. తాను మెట్లు దిగేసరికి ట్రైన్ ప్లాట్‌ఫామ్ దాటిపోయింది. దిక్కులు చూశాడు. సైంటిస్టు కావల్సిన తాను ఇలా ఫిజిక్స్ లెక్చరర్‌గా ఉండిపోయాడు.

తనకు అన్యాయం జరిగింది. అడిగే నాథుడు లేడు. తనకు జరిగిన అన్యాయం తన విద్యార్థులకు జరగకూడదు. డిగ్రీ పరీక్షలకు అరగంట లేటు అనుమతించగా లేనిది వీరిని అనుమతిస్తే తప్పేమిటి? ఈ నిబంధన బాగా లేదనిపించి ఒకసారి ప్రిన్సిపాల్‌గారితో అంటే అతను నవ్వుతూ "నిజమే మిస్టర్ యుగంధర్! ముప్పై నిమిషాలు లేటుగా వచ్చినవాడిని లోపలకి రానిచ్చిన మీరు మరొక్క 20 సెకండ్లు లేటొచ్చినవాడిని లోనికి రానివ్వకుండా అడ్డుకోలేదా? అది అన్యాయం కాదా? డిగ్రీ పరీక్షల్లో ఎస్సేటైప్ ఆన్సర్లు రాయాలి. ఒకవేళ క్వశ్చన్ లీకయినా జవాబు చదువుకొని రావడానికి కనీసం పదిహేను నిమిషాలు పడుతుంది. ఇవి ఆబ్జెక్టివ్ టైప్. పది టెలిఫోన్ నెంబర్లు చదువుకోడానికి ఎంత టైమ్ పడుతుంది. వీటిలో కనీసం ఐదు గుర్తుంచుకున్నా ఏభై మార్కులు సంపాదించుకోవచ్చు"

"నిజమే సార్! ఒకసారి బి.ఎ. ఎంట్రెన్స్ పరీక్షకి ఒకడు పావుగంట లేటుగా వచ్చాడు. ఇంగ్లీషు పేపరు రాయడానికి ఇంకా ముప్పావుగంటే ఉంది. రాస్తానన్నాడు. సరే! వాడు రాస్తానంటే నాదేం పోయింది అని ఎలౌ చేశాను. బుక్‌లెట్ ఇచ్చాను.. సార్! లేటుగా రావడానికి వాళ్లు ఏవో కారణాలు చెప్తారు గానీ నేను నమ్మను. నా అనుమానాలు నాకుంటాయి."

"మీరు ఎవరిని నమ్మేరు గనక"


"సార్! నేను రీజన్‌ని నమ్ముతాను. ఆ కుర్రాడిని ఒక కంట కనిపెడుతూనే ఉన్నాను. హాల్ టికెట్ వెనుక నెంబర్లు చూస్తూ ఎ.బి.సి.డి.లు టిక్ పెడుతున్నాడు. ఈ నంబర్లేమిటి అని అడిగితే ఫ్రెండ్స్ సెల్ నెంబర్లని చెప్పాడు. హాల్‌టికెట్ తీసుకొని తరువాత ఇస్తానన్నాను. అంతే! టిక్కులు పెట్టడం మాని దిక్కులు చూస్తూ కూర్చున్నాడు. ఎలాగైనా పిల్లలు మనకంటే తెలివైన వాళ్లు సార్"

"కానీ ఈ పరీక్షలు అట్లాంటివి కావు. పోటీ పరీక్షలు. డిగ్రీ పరీక్షల్లో ఒక వంద మంది ఎక్కువ పాసయినా నష్టపోయే వాళ్లు ఎవరూ ఉండరు. పోటీ పరీక్షలట్లా కాదు. ఒకరు గెలిస్తే ఒకరు ఓడిపోతారు. ఇది పరుగు పందెం లాంటిది. ఒకడుగు ముందు వేసిన వాడు గెలుస్తాడు. ఒక అడుగు, ఒకేఒక్క అడగు వెనక్కున్నవాడు ఓడిపోతాడు. కాబట్టి సమర్థులు గెలవాలి. అసమర్థులు గెలవకూడదు అన్న సూత్రం పాటించాలి" ప్రిన్స్‌పాల్ చెప్పిన సూత్రం మనస్సులో నాటుకుపోయింది యుగంధర్‌కి.

యుగంధర్ టీవీ ఆఫ్ చేసి నిద్రలోకి జారుకున్నాడు.

మార్నింగ్ వాక్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా కాలేజీగేట్ వద్ద తుప్పల్లో ఒక సెల్‌ఫోన్ కనిపించింది. ఎవరిదో పడిపోయుంటుంది. వారికి అందజేద్దాం అనుకొని తీసి జేబులో వేసుకున్నాడు యుగంధర్. టిఫిన్ చేసిన తరువాత పోలీస్ స్టేషన్‌లో అందజేస్తే వారే చూసుకొంటారు అనుకుంటూ ఇంటికి వచ్చాడు. కాఫీ తాగుతూ పేపరు తిరగేశాడు. మొదటిపేజీలోనే నిమిషం లేటు ఆశలపై వేటు అన్న వార్త ఆకర్షించింది. ఒక అబ్బాయి మూసిన గేటు వద్ద నిలబడి ఉన్నాడు. లోపల వాచ్‌మాన్ ఉన్నాడు... అది తమ కాలేజీ గేటే. వార్త చదివాడు... అధికారుల అనాలోచిత నిర్ణయం వల్ల రేయింబవళ్లు పుస్తకాలకే అంకితమై, తమ కేరియర్‌పై ఆశలు పెంచుకున్న వేలాది మంది విద్యార్థులు ఒక ఏడాది నష్టపోవలసి వస్తుంది. ఇంకా చాలా రాశారు... పిల్లలు లేటుగా రావడం, వారిని గేటు వద్దే ఆపడం అన్న విషయం తన దృష్టికి రాలేదు. బహుశా ప్రిన్సిపాల్ ఎవరితోనూ చెప్పి ఉండకపోవచ్చు.

పది గంటలకు కాలేజీకి బయలుదేరుతూ సెల్‌ఫోన్ పౌచ్ బెల్టుకు పెట్టుకొంటుండగా గేటు దగ్గర దొరికిన ఫోన్ విషయం గుర్తుకొచ్చింది. పోలీసు స్టేషన్‌లో అందజేద్దామని చేతిలోకి తీసుకున్నాడు యుగంధర్. కుతూహలం కొద్దీ ఆన్ చేశాడు. మెసేజ్ ఉంది. కొన్ని సెల్‌ఫోన్ నెంబర్లు ఉన్నాయి. తరువాత కొన్ని



## సిగరెట్‌కి గుడ్‌బై(ట)

*సల్మాన్ ఖాన్ తాజాగా సిగరెట్‌లు తాగడం మానేశాట్ట. 'అవును నిజమండీ, నేను సిగరెట్లకి గుడ్‌బై చెప్పేసాను. అఫ్‌కోర్స్ గతంలోనూ ఇలాగే చేసినా మాట మీద నిలబడలేకపోయాను. కానీ ఈసారి ఎలాగైనా వాటిని ముట్టుకోకూడదని సీరియస్‌గా అనుకుంటున్నాను' అంటున్నాడు. ఆరోగ్యరీత్యా పొగతాగడం మానేయమని వైద్యులు చెప్పడం మీదట సల్మాన్ ఇలాంటి నిర్ణయం తీసుకున్నాడని అతని సన్నిహితులు చెప్పుకుంటున్నారు. ఆమధ్య షారుఖ్ కూడా సిగరెట్లకి గుడ్‌బై అన్నాడు. మళ్లీ ఎంచక్కా వాటిని ఉఫ్ ఉఫ్‌మని ఊదేయడం మొదలెట్టాడు. సల్మాన్ సంగతి చూడాలి మరి!*

ఇంగ్లీషు మాటలు.

1.DAD-BAD-BABA-CACA-
2.ADD-BAD-DAD-BAABA.
3.CACA-BAD-DAD-DABA.
4. BABA-CACA-DABBAA.
1.baaba-caaca-daabaa.
2. dabba-baaba-add-bad
3. dad-baba-add-dabba
4. baabaa-caacaa-abba.

ఈ మాటలకు అర్థం ఏమిటి? 1.లో ఉన్న మాటలే 2, 3, 4లలో ఉన్నాయి. వరుస మారాయి అంతే. యుగంధర్ ఆలోచించాడు. చిటిక వేశాడు. అంటే ఏదో సాధించాడన్న మాటే. చిన్నప్పుడే చాలా డిటెక్టివ్ పుస్తకాలు చదివాడు. చదువుకొంటున్న రోజుల్లో అందరూ తనను డిటెక్టివ్ యుగంధర్ అని పిలిచేవారు. తను గూడా డిటెక్టివ్ యుగంధర్ అంత గొప్ప పరిశోధకుణ్ని కావాలనుకునేవాడు. ఎన్నో రహస్యాలు ఛేదించాడు. యుగంధర్ పెన్ను, కాగితం తీశాడు. 1 తరువాత ఉన్న అక్షరాలు డేష్‌లతో కలిపి లెక్క పెట్టి రాసుకున్నాడు. 20. 2 తరువాత ఉన్న అక్షరాలు డేష్‌లతో కలిపి లెక్క పెట్టాడు. 20. అప్పుడే ఒక ఐడియా వచ్చేసింది. తొందరపడి వెంటనే ఒక నిర్ణయానికి రాకూడదు. 3, 4 తరువాత ఉన్న అక్షరాలు గూడా డేష్‌లతో కలిపి లెక్క పెట్టాడు. అవి కూడా 20. తెలిసిపోయింది. ఇవి 20 బిట్స్‌కి ఆన్సర్లు. 1, 2, 3, 4 అంకెలు ABCD బుక్‌లెట్ కోడు గుర్తులు. పెద్ద అక్షరాలలో ఉన్నవి ఫిజిక్స్. చిన్న అక్షరాలలో ఉన్నవి కెమిస్ట్రీ. అంకెలలో ఉన్నవి లెక్కలు. సెల్ నెంబర్లు రాసుకున్నాడు. డిటెక్టివ్‌లు ప్రతీదీ రాసుకోవాలి కదా! అన్నీ ఒక్కసారి చూసుకున్నాడు. చిటికేశాడు. మొదటి నాలుగు నెంబర్లు 92తో ప్రారంభమయ్యాయి. తరువాత నాలుగు నెంబర్లు 94తో ప్రారంభమయ్యాయి. తరువాత నెంబర్లు 98, 99లతో ప్రారంభమయ్యాయి. అంటే ఇవి వరుసగా ABCD బుక్‌లెట్ కోడు గుర్తులు. మొత్తం 16 ఫోన్ నెంబర్లు. ఒక్కొక్క కోడ్‌తో నాలుగు ఫోన్ నెంబర్లు. ఫోన్ నెంబర్లు ఒక్కొక్క దానిలో పది అంకెలు. మొదటి రెండు అంకెలు కోడ్‌కి పోగా మిగిలినవి ఎనిమిది. 4x8 = 32. ఇవి ఒకటి నుండి వరుసగా ముప్పై రెండు ప్రశ్నలకు జవాబులు. అక్కడక్కడ అంకెలకు బదులు డాష్‌లు ఉన్నాయి. జవాబు తెలిని చోట్ల డాష్‌లు పెట్టారు. విద్యార్థి ఆలోచించుకొని జవాబు రాసుకోవాలి. కెమిస్ట్రీలో 4, ఫిజిక్స్‌లో 6, లెక్కలలో 7 డాష్‌లు ఉన్నాయి. మొత్తం తెలిసిన జవాబులు 16+14+25 = 55. ఈ ఒక్క నిమిషంలో మెసేజ్ అందుకొన్న వాడికి సునాయాసంగా 55 మార్కులు వస్తాయి. 180 నిమిషాల కాలంలో ఇతర విద్యార్థులు 160 బిట్స్ ఆన్సరు చెయ్యవలసి ఉంటే వీరు 179 నిమిషాలలో, పోనీ గేట్ నండి హాలులోనికి రావడానికి ఐదు నిమిషాలు, ప్రిలిమినరీకి నాలుగు నిమిషాలు తీసుకున్నా ఇంకా 170 నిమిషాలు ఉంటాయి. అంటే 170 నిమిషాలలో వీరు 105 బిట్లు బాగా ఆలోచించుకుని రాయొచ్చు. వాటెన యిడియా!

ఐతే సెల్‌ఫోన్ కాలేజీ గేటు దగ్గరకు ఎలా వచ్చింది. యుగంధర్ ఊహకు అందనిదంటూ లేదు. మరోసారి పేపరు చూశాడు. గేటుదగ్గర నిలబడ్డ అబ్బాయి మీదే దృష్టంతా కేంద్రీకరించాడు. యోగులు నాశికాగ్రం మీద దృష్టి కేంద్రీకరించినట్లు యుగంధర్ కొంతసేపు అక్కడే ఆ అబ్బాయి మీదే దృష్టి నిలిపాడు. అంతే యుగంధర్ కంటి ముందు భూత, భవిష్యత్, వర్తమానాలు సినిమా ఫ్రేములాగ కదిలాయి. ఫిల్ము రివైండు చేసి మళ్లీ చూడ్డం ప్రారంభించాడు. గేటు దగ్గర నిలబడ్డ అబ్బాయి తొమ్మిది నలభై నిమిషాలకే వచ్చాడు. గేట్ దగ్గర హాల్‌టికెట్ చూసి లోనికి పంపుతున్నారు. సెల్‌ఫోన్‌లు లోపలకి తీసుకురానివ్వడం లేదు. తనకు పది తరువాత ఒకటి రెండు నిమిషాలలో మెసేజ్ వస్తుంది. ఆ అబ్బాయి వెనక్కి వెళ్లిపోయాడు. కొంచెం దూరంలో ఎవరికీ కనిపించకుండా కూర్చున్నాడు. అనుకొన్నట్లుగానే మెసేజ్ వచ్చింది. దానిని చదువుకుంటూ వచ్చేసరికి గేటు మూసేశారు. లోపలకి రానివ్వలేదు. ఈ సెల్ లేకపోతే తను గూడా మిగతా విద్యార్థులలాగే ఈపాటికి పరీక్ష రాస్తుండేవాడు. కోపంతో సెల్ తుప్పల్లోకి విసిరేసి ఏడ్చుకుంటూ వెళ్లిపోయాడు.

యుగంధర్ కళ్ల ముందు మరేం కనిపించలేదు. ఊహకు పనిపెట్టాడు. ఇదొక పెద్ద నెట్‌వర్క్. ఒక కార్పొరేట్ సంస్థ ఇరవై మంది ఇన్విజిలేటర్లను లోబరుచుకుంది. వాళ్లు నిష్ణాతులైన సబ్జెక్టు లెక్చరర్లు. ఎవరు ఏయే ప్రశ్నలకు జవాబులు పంపాలో ముందుగానే నిర్ణయించుకున్నారు. ఐతే ప్రశ్నలు ముందుగా తెలుసుకునే అవకాశం లేదు. హాలులో విద్యార్థుల వెనుక నిలబడి వారు పేపరు చదువుతున్నప్పుడే తాము కూడా ప్రశ్నలు చదివి హెడ్‌క్వార్టర్సుకి ఆన్సర్లు పంపాలి. అలానే చేశారు. హెడ్‌క్వార్టర్సులో డేటా ప్రాసెస్ చేశారు. అక్కడ నుండి తమ విద్యార్థులకు వెంటనే మెసేజ్‌లు వెళ్లిపోయాయి. యుగంధర్ 'యురేకా, యురేకా' అంటూ కేకలు వేశాడు.

ఈ కేకలు విన్న అతని భార్య "ఏవిటా గావుకేకలు, ఏవిటా భాష, లేవండి, లేవండి" అంటూ యుగంధర్ ఆలోచనను చెదరగొట్టేసింది.

○

## కరిష్మా క్రేజ్

సినిమాల్లో నటించినంత కాలం కరిష్మాకపూర్ క్రేజ్ అందరికీ తెలుసు. నంబర్ వన్ హీరోయిన్‌గా ఎన్నో హిట్ చిత్రాలు చేసింది. అయితే పెళ్లయ్యాక ఆ క్రేజ్ కాస్త తగ్గిపోయి సినిమా చాన్సులూ కరువయ్యాయి. అలాంటి సమయంలో టీవీ రంగ ప్రవేశం చేసింది కరిష్మా. రియాలిటీ షోలకు జడ్జ్‌గా ఇప్పుడు కరిష్మాకి మంచి డిమాండ్ వుందనేది బుల్లితెర విమర్శకుల అభిప్రాయం. ఎలాంటి డిమాండ్లు చేయకుండా ఆయా షోల షూటింగ్‌లకు అందుబాటులో వుంటూ మంచి పేరు కొట్టేసి క్రేజ్‌ని పెంచుకుంటోందిట కరిష్మా. ఈ క్రేజ్‌తో తిరిగి సినిమాల్లో బిజీ అవుతుందేమో!

